సాక్షి సిద్దిపేట

ఆదివారం । 14 । మే । 2023



అవనిపై అద్భుతం 'అమ్మ'

పదాలతో వివరించలేని మాట అమ్మ. దేవుడి సృష్టిలో అద్భుతం అమ్మ. నేడు అంతర్జాతీయ మాతృ దినోత్సవం సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనాలు.. 10లో



వానొస్తే.. జలదిగ్బంధమే

అభివృద్ధికి నమూనాగా చెప్పుకుంటున్న గజ్వేల్‌–ప్రజ్ఞాపూర్‌ మున్సిపాలిటీ ఏటా వరద ముప్పుతో వణికిపోతోంది. 11లో..



కాంగ్రెస్‌ నాయకుల సంబరాలు

కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్‌ ఘన విజయం సాధించిన సందర్భంగా శనివారం కాంగ్రెస్‌ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. 11లో..

న్యూస్‌రీల్‌

గౌరవెల్లి ట్రయల్‌ రన్‌



రేగొండ పంపుహౌస్‌ వద్ద డెలివరీ సిస్టం ద్వారా నీరు వస్తున్న దృశ్యం

అక్కన్నపేట(హుస్నాబాద్‌): సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గుడాటిపల్లి గ్రామం వద్ద నిర్మించిన గౌరవెల్లి రిజర్వాయర్‌కు శనివారం మరోసారి గోదావరి జలాలు విడుదల చేశారు. రేగొండ పంపుహౌస్‌ వద్ద ఇంజినీరింగ్‌ ఆఫీసర్లు మోటార్లను ఆన్‌చేసి పరిశీలించారు. గత ఏడాది జూలై 31న ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్‌ మోటార్లను ఆన్‌చేసి చేసిన విషయం తెలిసిందే. ఇదిఇలా ఉంటే గౌరవెల్లి రిజర్వాయర్‌ పనులు దాదాపు పూర్తయినట్లే. కుడి, ఎడమ కాల్వలు, తూములకు షట్టర్ల బిగింపు పనులు తుదిదశకు చేరాయి. వచ్చే నెలలో సీఎం కేసీఆర్‌చే ప్రాజెక్టు ప్రారంభించేందుకు ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌ సన్నాహాలు చేస్తున్నారు.

కొనుగోలు చేసిన ధాన్యం తరలించాలి



కొనుగోలు కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న అడిషనల్‌ కలెక్టర్‌

బెజ్జంకి(సిద్దిపేట): కొనుగోలు చేసిన ధాన్యం వెంటనే రైస్‌మిల్లులకు తరలించాలని అడిషనల్‌ కలెక్టర్‌ శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. శనివారం బెజ్జంకి, బేగంపేట, వడ్లూర్‌లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా అడిషనల్‌ కలెక్టర్‌ మాట్లాడుతూ సేకరించిన ధాన్యం వేగంగా తరలించాలన్నారు. అవిసరమైతే ఎక్కువ మంది హమాలీలను వినియోగించి లారీల్లో లోడ్‌చేయించాలన్నారు. కొనుగోలు, రవాణాలలో ఏదైన ఇబ్బందులు వెంటనే తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

నాచగిరిలో భక్తుల సందడి



కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

వర్గల్‌(గజ్వేల్‌): ఉమ్మడి జిల్లాలో సుప్రసిద్ధమైన నాచగిరి లక్ష్మీనృసింహ క్షేత్రం శనివారం కల్యాణాలు, సత్యనారాయణ వ్రతాలు, అభిషేకాలతో అలరారింది. స్వామివారి మొక్కులు తీర్చుకునేందుకు ఉదయమే వివిధ ప్రాంతాల భక్తులు క్షేత్రానికి చేరుకున్నారు. ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలాచరించారు. ఆలయ మండపానికి చేరుకొని స్వామివారికి కల్యాణం జరిపించి మొక్కు తీర్చుకున్నారు. అదేవిధంగా నిజాభిషేకాలు, దంపతులు వ్రతాలు ఆచరించారు. క్షేత్రంలో 27 వ్రతాలు, 12 అభిషేకాలు, 8 కల్యాణాలు జరిగినట్లు ఆలయ వర్గాలు తెలిపారు.

ప్రభుత్వం మొండి వైఖరి తగదు



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న జేపీఎస్‌లు

సిద్దిపేటరూరల్‌: రాష్ట్ర ప్రభుత్వం జేపీఎస్, ఓపీఎస్‌ల పట్ల మొండివైఖరి విడనాడాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు అన్నారు. శనివారం కలెక్టరేట్‌ ప్రాంగణం వద్ద జూనియర్, ఔట్‌సోర్సింగ్‌ పంచాయతీ కార్యదర్శులు రెగ్యులరైజేషన్‌ కోసం చేపట్టిన నిరవధిక సమ్మెలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నోటిఫికేషన్‌లో ప్రకటించిన విధంగా వెంటనే జేపీఎస్‌ ల రెగ్యులరైజేషన్‌ చేపట్టకుండా కాలం వెల్లదీయం సరికాదన్నారు. శనివారం మధ్యాహ్నం వరకు ఉద్యోగంలో చేరాలని అల్టిమేటం జారీచేసినా ఒక్కరు కూడా విధుల్లో చేరలేదన్నారు. ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 49 మంది జేపీఎస్‌లు మరణించారన్నారు. ఉద్యోగ భద్రత లేక వరంగల్‌ జిల్లా నర్సంపేట మండలం రంగాపురంలో ఆత్మహత్య చేసుకున్న జూనియర్‌ పంచాయతీ కార్యదర్శి భైరి సోనికి నివాళి అర్పించారు. జిల్లా జేపీఎస్, ఓపీఎస్‌ల తరఫున ఆమె కుటుంబ సభ్యులకు రూ.50 వేల ఆర్థిక సహాయం చేసినట్లు తెలిపారు. సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

కుక్కల బెడద తగ్గుతోంది..

గుర్రాలగొందిలో వ్యర్థాల నిర్వహణ

- ఫలితాలిస్తున్న అధికారుల చర్యలు
- బాగుందంటున్న గ్రామస్తులు
- మరో మూడుగ్రామాల్లో షురూ

సాక్షి, సిద్దిపేట: చికెన్‌ సెంటర్లు, మటన్‌ షాప్‌ల నుంచి వెలువడే వ్యర్థాలు రోడ్ల పక్కన, గ్రామశివార్లలో పడేసేవారు. వాటిని తిన్న శునకాలు క్రూరంగా ప్రవర్తించేవి. జనంపై దాడులకు తెగబడేవి. దీంతో జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి వ్యర్థాల నిర్వహణ కోసం చర్యలు తీసుకున్నారు.

గుర్రాల గొందిలో..

సిద్దిపేట జిల్లా గుర్రాలగొంది గ్రామ జనాభ 2,717 మంది ఉండగా, 2,124 మంది ఓటర్లు, 794 నివాసాలు, 1,094 కుటుంబాలున్నాయి. గ్రామంలో ఏడు చికెన్‌ సెంటర్లు, రెండు మటన్‌ షాప్‌లు ఉన్నాయి. ఆయా దుకాణాల నిర్వాహకులతో డీపీవో దేవకీదేవి, స్థానిక సర్పంచ్‌ శాతరాజుపల్లి ఆంజయనేయులు సమావేశం నిర్వహించారు. వ్యర్థాలను డంపింగ్‌ యార్డు సమీపంలో 8 ఫీట్ల వెడల్పు, 8 ఫీట్లలోతుతో తవ్విన గుంతలో వేయాలని ఆదేశించారు. చుట్టూ గోడ కట్టి పైన ఇనుప జాలీని అమర్చారు. షాప్‌ల యజమానులు వ్యర్థాలను వేసి మట్టిని పోస్తున్నారు. అలా రెండు నుంచి మూడేళ్ల పాటు మురగబెట్టి సేంద్రియ ఎరువు తయారు చేస్తున్నారు.

తగ్గుతున్న కుక్కల సంఖ్య

ఒకప్పుడు కుక్కలు గ్రామంలో గుంపులు గుంపులుగా కనిపించేవి. రెండు నెలల క్రితం జంతు వ్యర్థాల నిర్వహణ ప్రారంభించారు. దీంతో కుక్కల గుంపులు తగ్గాయి. ఆహారం లభించకపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్తున్నాయి.



గుర్రాలగొందిలో ఏర్పాటుచేసిన గుంతలో వ్యర్థాల వేస్తున్న చికెన్‌ సెంటర్‌ నిర్వాహకుడు

మరో మూడు గ్రామాల్లో....

గుర్రాలగొందిలో ఏర్పాటు చేసిన జంతు వ్యర్థాల నిర్వహణను జిల్లాలోని నారాయణరావుపేట మండలం లక్ష్మీపూర్, నారాయణరావుపేట, జక్కాపూర్‌లో ఏర్పాటు చేశారు. ఫలితంగా ఆయా గ్రామాల్లో కుక్కల బెడద తగ్గిందని స్థానికులు అంటున్నారు.

బెడద తగ్గింది..



చికెన్, మటన్‌ వ్యర్థాల నిర్వహణ లేనప్పుడు శివారులో రోడ్డుకు ఇరువైపుల జంతు వ్యర్థాలు పడేసేవారు. దీంతో గ్రామంలో మెయిన్‌ రోడ్డుకు వస్తుండగా దుర్వాసనతో పాటు కుక్కలు సంచరించేవి. రెండు నెలల క్రితం జంతు వ్యర్థాల కోసం పిట్‌ తవ్వి అందులో వేస్తుండడంతో కుక్కల బెడద తగ్గింది.

– శాతరాజుపల్లి ఆంజయనేయులు, సర్పంచ్, గుర్రాలగొంది

భయంగా వేసేవాళ్లం..



జంతు వ్యర్థాల నిర్వహణ లేనప్పుడు భయం భయంగా ఎవరు చూడనప్పుడు ఊరవతల వేసి వచ్చే వాళ్లం. ఇప్పుడు స్థానికంగా ఏర్పాటు చేసిన గుంతలో వేస్తున్నాం.

–రాములు, చికెన్‌ సెంటర్‌ నిర్వహకుడు

ఆహారం దొరక్కపోతే ఉండవు..



కుక్కలకు ఆహారం దొరకకపోతే ఇతర ప్రాంతాలకు వెళ్తుంటాయి. కొద్ది రోజులు స్థానికులు జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే వాటికి ఆహారం లభించకపోతే కరిచే అవకాశాలుంటాయి. వ్యర్థాల నిర్వహణతో కుక్కలను చాలా వరకు నియంత్రించవచ్చు.

– జగత్‌ కుమార్, జాయింట్‌ డైరెక్టర్, పశుసంవర్థక శాఖ

ఇంటింటికి మల్లన్న సాగర్‌ నీరు



పట్టణంలో ప్రజాప్రతినిధులు, అధికారుల పరిశీలన

సిద్దిపేటజోన్‌: సిద్దిపేట ప్రజల దాహార్తి తీర్చడం కోసం చర్యలు ప్రారంభమయ్యాయి. శనివారం మల్లన్నసాగర్‌ తాగునీటి పథకం ట్రయల్‌ రన్‌ చేసినట్లు మున్సిపల్‌ కమిషనర్‌ సంపత్, మున్సిపల్‌ మాజీ చైర్మన్‌ రాజనర్సు, వైస్‌ చైర్మన్‌ కనకరాజు, బీఆర్‌ఎస్‌ పట్టణ అధ్యక్షుడు సంపత్‌ రెడ్డి తెలిపారు. హౌసింగ్‌ బోర్డు, టీచర్స్‌ కాలనీ, కాళ్లకుంట కాలనీ తదితర ప్రాంతాల్లో తాగునీటి సరఫరాను అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. మంత్రి హరీశ్‌ రావు చొరవతో మల్లన్నసాగర్‌ గోదావరినీటిని వాటర్‌ రింగ్‌ ప్రక్రియ ద్వారా పట్టణానికి తీసుకొచ్చినట్లు వివరించారు. ఇప్పటి వరకు కొన్ని ఏరియాల్లో మాత్రమే రోజువిడిచి రోజు తాగు నీరు సరఫరా అయ్యేదని, ఇక నుంచి అన్ని వార్డుల్లో నిత్యం తాగునీటి సరఫరా ఉంటుందన్నారు. మరో నాలుగు రోజుల్లో మంత్రి హరీశ్‌రావు మల్లన్నసాగర్‌ తాగునీటి సరఫరాను ప్రారంభిస్తారని వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అర్వింద్, భమ్మం, శ్రీనివాస్‌ యాదవ్, మున్సిపల్‌ అధికారులు సతీశ్, అన్వేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధే సీఎం లక్ష్యం



ఇటిక్యాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రతాప్‌రెడ్డి

జగదేవ్‌పూర్‌(గజ్వేల్‌): రైతుల ఆర్థికాభివృద్ధే సీఎం కేసీఆర్‌ లక్ష్యమని అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్‌ ప్రతాప్‌ రెడ్డి అన్నారు. మండలంలోని ఇటిక్యాల, గొల్లపల్లి గ్రామాల్లో పీఏసీఎస్‌ ఆధ్వర్యంలో శనివారం ఆయన కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో గ్రామాల్లో చెరువులు, కుంటలు, బోరు బావులకు పూర్వ వైభవం వచ్చిందన్నారు. రైతులు ఆర్థికంగా బాగుపడాలన్నా లక్ష్యంతో రైతు పథకాలు తీసువచ్చారన్నారు. అనంతరం ఇటిక్యాలలో నిర్మిస్తున్న కల్యాణమండపం పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలేశంగౌడ్, జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, పీఏసీఎస్‌ చైర్మన్‌ ఇంద్రసేనారెడ్డి, సర్పంచ్‌లు చంద్రశేఖర్, మమత అంజిరెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌గౌడ్, మండల కోఆప్షన్‌ సభ్యుడు ఎగ్బాల్, ఉపసర్పంచ్‌ సిద్దులు, మాజీ సర్పంచ్‌లు కరుణకర్, మహేందర్‌గౌడ్, సీఈఓ రాములు, నాయకులు భిక్షపతి, వెంకటచల్మారెడ్డి, వెంకటయ్య, చిన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు అండగా ఉందాం

- అధికారులు అలసత్వం వీడాలి
- కొనుగోలు కేంద్రాలను సందర్శించాలి
- టెలీకాన్ఫరెన్స్‌లో మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటజోన్‌: అకాల వర్షాలతో రైతులు నష్టపోయారని, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేసి అన్నదాతకు అండగా ఉండాలని ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు సూచించారు. శనివారం అమెరికా నుంచి ఎంపీ ప్రభాకర్‌ రెడ్డి, కలెక్టర్‌ ప్రశాంత్‌ జీవన్‌పాటిల్, జెడ్పీ చైర్‌పర్సన్‌ రోజాశర్మ, ఎమ్మెల్యేలు సతీశ్‌కుమార్, ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, ఎమ్మెల్సీలు, అదనపు కలెక్టర్లు ముజమ్మిల్‌ ఖాన్, శ్రీనివాస్‌ రెడ్డి, మార్కెట్‌ కమిటీ చైర్మన్లు, పీఏసీఎస్‌ చైర్మన్లు, ఎంపీపీ, జెడ్పీటీసీలు, రెవెన్యూ, మార్కెట్, ఐకేపీ అధికారులతో టెలీకాన్ఫరెన్స్‌ నిర్వహించారు. ఇప్పటి వరకు 7,304 మంది రైతుల నుంచి 32,508 మెట్రిక్‌ టన్నుల ధాన్యం సేకరించినట్లు తెలిపారు. కొనుగోలుచేసిన ధాన్యం ట్యాబ్‌ ఎంట్రీలో జాప్యం జరుగుతుందన్నారు. ధాన్యం రవాణా విషయంలో మిల్లర్లు సహకరించాలన్నారు. గన్ని సంచులు, ప్యాడీ క్లీనర్లు, టార్పాలిన్లు కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. తాలు, తేమ తదితర కారణాలతో ధాన్యం కొనమనే పరిస్థితి రావొద్దన్నారు. తహసీల్దార్, వ్యవసాయ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు విధిగా కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించాలన్నారు. మరోవారం రోజుల్లో తుపాన్‌ వచ్చే అవకాశాలు ఉన్నాయని వాతావరణశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారని అధికారులు, ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా ఉండి కొనుగోళ్లు త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు.



మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌ రావు

వరికోత.. అదనపు వాత!



దుబ్బాకకు చెందిన ఈయన పేరు గుండెల్లి శ్రీనివాస్‌రెడ్డి. 12 ఎకరాల్లో వరిసాగుచేశాడు. ఇటీవల కురిసిన వర్షానికి నీరంతా పొలంలో చేరింది. భూమి తడిగా ఉండడంతో చేతికొచ్చిన పంటను చైన్‌ హార్వెస్టర్‌తో కోయించాడు. సాధారణంగా 12 ఎకరాల వరి కోసేందుకు మామూలు హార్వెస్టర్‌ అయితే 14 గంటలు పట్టేది. చైన్‌ మిషన్‌తో కోస్తే 18 గంటలకుపైగా సమయం పట్టింది. వరికోసి రోడ్డుపైకి తెచ్చి ట్రాక్టర్‌లో పోయాల్సిరావడంతో అదనంగా 5 గంటలు పెరిగింది. పైగా కామన్‌ హార్వెస్టర్‌కు గంటకు 2 వేలు ధర చెల్లించాల్సి వచ్చేది. చైన్‌ మిషన్‌కు గంటకు రూ.3 వేలకు పైగా చెల్లించాడు. రూ.26 వేలలోపు కోత పూర్తికావాల్సిన చోట రూ.50 వేలు అయ్యింది. ప్రతీసారి ధాన్యం 350 క్వింటాళ్ల దిగుబడి వచ్చేది. ఈసారి వర్షాలు.. వడగండ్ల కారణంగా 100 క్వింటాళ్లే వచ్చింది. ఇటు పెట్టుబడి పోయే.. అటు దిగుబడి రాలే. దీంతో శ్రీనివాస్‌రెడ్డికి అదనంగా రూ. 2 లక్షల పెట్టుబడి మీదపడింది. ఇది ఒక్క ఆయన పరిస్థితే కాదు.. జిల్లాలో చాలామంది రైతుల దుస్థితి.

–దుబ్బాకటౌన్‌



నీరు చేరిన చేనులో వరి కోస్తున్న చైన్‌ మిషన్‌

- రైతుల నరకయాతన
- తడిఆరని భూములు
  దిగబడుతున్న హార్వెస్టర్లు
- చైన్‌మిషన్లతో కోతలు
- ఎకరానికి రూ.5 వేలకుపైగా భారం
- జిల్లాలో ఇప్పటి వరకు 35 శాతం కోతలు

అన్నదాత అతలాకుతలం..

యాసంగి పంట చేతికొచ్చే సమయంలో జిల్లాలో వడగండ్లు అతలాకుతలం చేశాయి. వడ్లన్నీ చేలలోనే రాలిపోయాయి. మిగిలిన కొద్దోగొప్పో ధాన్యం కోతలు ప్రారంభించిన అన్నదాతలు పొలాల్లో నీటితడితో ఇబ్బంది పడుతున్నారు. టైర్‌ హార్వెస్టర్లు దిగబడుతుండడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఎక్కువ ధర చెల్లించి చైన్‌ మిషన్లతో కోతలు చేపడుతున్నారు. దిగుబడి కూడా అంతంతగా రావడంతో పెట్టుబడి చేతికందే పరిస్థితి లేకుండా పోయింది.

అదనపు భారం..

హార్వెస్టర్‌కు గంటకు రూ.2 వేలు ఉండగా, చైన్‌ మిషన్లకు గంటకు రూ.3 నుంచి రూ. 3500 వేలు చెల్లించాల్సి వస్తోంది. చేలన్నీ తడిగా ఉండడంతో ధాన్యం లోడ్‌చేసుకునేందుకు ట్రాక్టర్లు పొలాల్లోకి వెళ్లలేని పరిస్థితి. దీంతో చైన్‌మిషన్‌తోనే వడ్లను రోడ్డువరకు తీసుకురావాల్సి వస్తోంది. మిషన్‌కు టైం కూడా ఎక్కువ అవుతోంది. ఎకరానికి రైతుపై అదనంగా రూ. 5 నుంచి రూ.6 వేల భారం పడుతుంది.

పశువుల మేతకు తిప్పలు..

చైన్‌మిషన్లతోనే కోతలు కోయిస్తుండడంతో పశువులకు మేతకొరత ఏర్పడనుంది. చైన్‌మిషన్‌ కోయడంతో వరిగడ్డి చేతికి రానిపరిస్థితి ఉంటుంది. దీంతో పశువులు ఉన్న రైతులకు గడ్డికి ఇబ్బందులు పడేపరిస్థితి నెలకొంది.

35 శాతానికిపైగా వరికోత..

జిల్లాలో యాసంగిలో 3.31 లక్షల ఎకరాల్లో వరి సాగుచేశారు. ఇప్పటి వరకు 35 శాతం అంటే సుమారు 1.15 లక్షల ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. ఇంకా 65 శాతం కోతలు కావాల్సి ఉంది. ఇప్పటికే కోతలు పూర్తయిన వాటిలో 25 శాతం వరకు చైన్‌ మిషన్లు, ఫోర్‌ వీల్‌తోనే పూర్తిచేశారు.

చైన్‌మిషన్‌ దొరకడం లేదు..



రెండు ఎకరాల్లో పొలం కోతకు వచ్చింది. చేనంతా నీరు నిలిచి తేమగా ఉండడంతో చైన్‌ మిషన్‌తోనే కోయాల్సిన పరిస్థితి. గంటకు రూ.3200 అడుగుతున్రు. అయినా మిషన్లు దొరుకుతలేవు. నేను వరి ఎప్పుడు కోయాల్సి వస్తదో ఏమో అర్థం అయితలేదు.

– పాతూరి పెద్ద లక్ష్మారెడ్డి, దుబ్బాక

గౌరవెల్లిపై సవతితల్లి ప్రేమ

హుస్నాబాద్‌: హుస్నాబాద్‌ ప్రాంతం కమ్యూనిస్టుల కంచుకోట అని, హుస్నాబాద్‌లో అధికారంలో ఉండి అభివృద్ధి చేయకపోతే తాట తీస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్‌ అన్నారు. పట్టణంలో శనివారం అనభేరి సింగిరెడ్డి అమరుల భవన్‌లో పార్టీ నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంద పవన్‌ మాట్లాడుతూ.. హుస్నాబాద్‌ ప్రాంతం చైతన్యవంతమైన ప్రాంతమని ఈ ప్రాంతంలో 8 సార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన ఘనత సీపీఐ పార్టీదన్నారు. ఈ మధ్య కాలంలో పుట్టుకొచ్చిన బూర్జువా పార్టీలు హుస్నాబాద్‌ను అభివృద్ధి చేయడంలో విఫలమయ్యాయని ఆరోపించాడు. ప్రస్తుత ఎమ్మెల్యే చేతగానితనంతో గౌరవెల్లి ప్రాజెక్టు ఇంకా పూర్తి కాలేదన్నారు. ఇదే జిల్లాలో మల్లన్నసాగర్, రంగనాయక సాగర్, కొండపోచమ్మ ప్రాజెక్టులు మూడు ఏళ్లల్లో పూర్తికాగా గౌరవెల్లి పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావులు ఈ ప్రాంతంపై సవతి తల్లి ప్రేమను చూపిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో సీపీఐ బరిలో ఉంటుందన్నారు. ఈ నెల 15న హుస్నాబాద్‌లో నిర్వహించే భారీ బహిరంగసభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ నాయకులు గడిపె మల్లేశ్, జాగిరి సత్యనారాయణ, కొమ్ముల భాస్కర్, వనేశ్, అందె స్వామి, కొయ్యడ సృజన్‌కుమార్, లక్ష్మారెడ్డి, జనార్దన్, యాద పద్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి పవన్‌

బగ్గీకారు సందడి



సిద్దిపేట కోమటి చెరువు ట్యాంక్‌ బండ్‌పై బగ్గీకారు సందడి చేస్తోంది. బ్యాటరీతో నడిచే ఈకారులో ఒకేసారి 11 మంది సందర్శకులు తిరిగే అవకాశం ఉంది. విలువ రూ.8 లక్షల వరకు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. దీనిని త్వరలో మంత్రి హరీశ్‌రావు ప్రారంభిస్తారని పర్యాటకశాఖ అధికారి రవీందర్‌చారి వివరించారు. – సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, సిద్దిపేట

క్లుప్తంగా

ముగ్గురి అదృశ్యం

పటాన్‌చెరులో ఇద్దరు విద్యార్థినులు..

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పోలీసుల స్టేషన్ పరిధిలో ఇద్దరు విద్యార్థినులు అదృశ్యమయ్యారు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన యువతి (17) ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తిచేసింది. అమీన్‌పూర్‌కు చెందిన ఆమె స్నేహితురాలు శుక్రవారం అంబేడ్కర్ కాలనీకి వచ్చింది. ఈ క్రమంలో ఇద్దరు మాట్లాడుకుంటుండగా, యువతి కుటుంబ సభ్యులు బయటకు వెళ్లారు. తిరిగి వారు ఇంటికి వచ్చే సరికి కూతురు కనిపించలేదు. వెళ్లే సమయంలో తన తోపాటు సర్టిఫికెట్స్, దుస్తులు తీసుకొని వెళ్లినట్లు కుటుంబ సభ్యులు గుర్తించారు. తెలిసిన వారు, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో యువతి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అమీన్‌పూర్‌కు చెందిన యువతి స్నేహితురాలు కూడా కనిపించడం లేదు.

రేగోడ్‌లో వివాహిత..



పద్మ (ఫైల్)


నారాయణఖేడ్: వివాహ శుభకార్యానికి అత్తారింటి నుంచి బయల్దేరిన వివాహిత మహిళ అదృశ్యమైందని ఎస్ఐ వెంకటొరెడ్డి తెలిపారు. మెదక్ జిల్లా కేంద్రం రేగోడ్‌కు చెందిన ముప్పారం పద్మ(37) ఈనెల 11న తన తల్లిగారి ఊరు సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం ర్యాలమడుగులో ఓ వివాహానికి హాజరయ్యేందుకు రేగోడ్ నుంచి బయలు దేరింది. అప్పటినుంచి ఆమె జాడలేకుండా పోయింది. తెలిసిన వారు, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ఈమేరకు సదరు మహిళ తండ్రి కమ్మరి నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల వద్ద చెక్‌డ్యాంలో శనివారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ విజయ్ తెలిపారు. మృతుడి వయసు సుమారు 35 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందని, ఒంటిపై నలుపు, తెలుపు గీతల టీషర్టు, నల్లటి డ్రాయర్ ఉందని అన్నారు. మంజీర నది ఎగువ భాగం నుంచి మృతదేహం కొట్టుకొని వచ్చి ఉండవచ్చన్నారు. పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించామని, సంబంధీకులు ఎవరైనా ఉంటే పాపన్నపేట పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

అవనిపై అద్భుతం అమ్మ

'పెదవే పలికిన మాటల్లోని తీయని మాటే అమ్మా.. కదిలే దేవత అమ్మా.. కంటి వెలుగు అమ్మా'.. అంటూ ఓ సినీ కవి తన పాటతో అమ్మ ప్రేమను ఎంతో గొప్పగా వర్ణించాడు. పదాలతో వివరించలేని మాట అమ్మ. దేవుడి సృష్టిలో ఓ అద్భుతం అమ్మ. అంతర్జాతీయ మాతృదినోత్సవం సందర్భంగా అమ్మ ప్రేమను గుర్తు చేసుకునేలా పలువురి అభిప్రాయాలతో సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనాలు మీకోసం..



మాతృ దినోత్సవం



గుడి కట్టి పూజలు

దుబ్బాకటౌన్: నవ మాసాలు మోసి, కని పెంచిన తల్లి తమకు దూరం కావడంతో తట్టుకోలేని కుమారులు ఆ మాతృమూర్తికి గుడి కట్టించి నిత్యం కొలుస్తున్నారు. ఆమె జ్ఞాపకార్థం గుడిలో విగ్రహాన్ని ప్రతిష్ఠించి నిత్యం కొలుస్తూ వారి ప్రేమను చాటుకుంటున్నారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం గోసాన్‌పల్లికి చెందిన చిన్నరాజాగౌడ్, కొలుగూరి సత్తవ్వకు నలుగురు కుమారులు నర్సాగౌడ్, నారాగౌడ్, చంద్రాగౌడ్, చిన్నచంద్రాగౌడ్, వెంకట్‌గౌడ్, ముగ్గురు కుమార్తెలు కళావతి, లక్ష్మీ, రేణుక సంతానం. తండ్రి గతంలోనే చనిపోవడం.. 2017లో తల్లి సత్తమ్మ మరణించడంతో వారి జ్ఞాపకార్థం 2021లో వారి పొలంలో గుడిని కట్టించి, విగ్రహాలను ప్రతిష్ఠించారు. ప్రతీ ఆదివారం అక్కడకు వెళ్లి పూజలు చేస్తున్నారు. కుమారులతోపాటు మనుమలు, మునిమరాండ్రు సైతం పూజలు చేయడం విశేషం.

తల్లిని మించిన దైవం లేదు

జన్మనిచ్చిన తల్లిదండ్రులే నిజమైన దేవుళ్లు. అమ్మ మృతిని మరిచిపోలేక తనను ఎప్పుడూ చూసుకోవాలనే కోరితో మా పొలంలోనే గుడికట్టించాం. అమ్మనాన్న విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రతీ వారం వారికి పూజలు చేస్తున్నాం. గుడికి వస్తే చాలా ప్రశాంతంగా ఉంటుంది.

– చంద్రాగౌడ్, లైన్‌మెన్



అమ్మ ప్రోత్సాహంతోనే..



జోగిపేట(అందోల్): అమ్మ ఇచ్చిన ప్రోత్సాహంతోనే ప్రస్తుతం ఈ స్థాయిలో ఉన్నా. చిన్నప్పటి నుంచే క్రీడలు, సామాజిక సేవలో ఉత్సాహంగా పాల్గొనేలా తల్లిదండ్రులు సహకారం అందించారని గుర్తు చేసుకున్నారు సంగారెడ్డి జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ. మదర్స్‌డే సందర్భంగా తన మాతృమూర్తి శాంతాదేవితో తనకున్న అనుభవాలను 'సాక్షి'తో పంచుకున్నారు. రాజకీయ కుటుంబ నేపథ్యం ఉండడంతో తరచూ ఇంట్లో జరిగే చర్చల్లో భాగస్వామ్యం కావడం, పాఠశాల స్థాయిలో నాయకత్వ లక్షణాలు అలవాటయ్యాయని తెలిపారు. చరిత్ర తెలుసుకునేందుకు అవసరమైన పుస్తకాలను అమ్మ మాతో చదివించేదని, దీంతో బయటి ప్రపంచం గురించి అనేక విషయాలను తెలుసుకోగలిగానని గుర్తుచేసుకున్నారు. అట్టు తల్లిగారి కుటుంబం, ఇటుభర్త జైపాల్‌రెడ్డి కుటుంబం రాజకీయాలకు దగ్గరగా ఉండడంతో జెడ్పీ చైర్‌పర్సన్‌గా సక్సెస్‌ఫుల్‌గా రాణిస్తున్నానని గర్వంగా చెబుతున్నారు.

– మంజుశ్రీ, జెడ్పీ చైర్‌పర్సన్

ట్రస్ట్ ఏర్పాటు చేసి సేవలు

హుస్నాబాద్: తల్లిపై మమకారం, ఆప్యాయత జీవితాంతం గుర్తుండేలా ట్రస్ట్ ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నాడు ఆ కుమారుడు. హుజూరాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ, వెంకటముత్యం దంపతులకు ఐదుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. కుమారులు రాజమౌళి, సుదర్శన్, దయాకర్, ప్రభాకర్, జగదీశ్వర్. చిన్నకుమారుడు జగదీశ్వర్ రిటైర్డ్ టీచర్. తల్లిపేరు మీద 2018లో ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి విద్యార్థులు, వృద్ధులు, పేదలకు తన వంతు సాయం చేస్తున్నాడు. అవివాహితుడైన జగదీశ్వర్ నెల నెలా వచ్చే పెన్షన్‌తో తోచినంత సాయం అందిస్తున్నాడు. ట్రస్ట్ ద్వారా ఇప్పటివరకు 76 ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు, పరీక్ష ప్యాడ్‌లు, గణిత దినోత్సవం రోజున ప్రతిభ గల విద్యార్థులకు నగదు, ఆగస్టు 15, జనవరి 26న పోటీలు నిర్వహించి బహుమతులు అందించాడు.



పొట్లపల్లిలో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న జగదీశ్వర్

వృద్ధులు, వికలాంగులకు దుస్తులు, ఆలయాలు, క్రీడా మైదానాల్లో కూర్చునేందుకు బెంచీలు, వృద్ధాశ్రమాలకు బీరువాలు, అన్నదానం, పేదలకు నిత్యావసరాల పంపిణీ, అనారోగ్యంతో ఉన్నవారికి, పేద విద్యార్థులకు చదువుకు ఆర్థిక సాయం చేస్తున్నాడు.

హుస్నాబాద్‌రూరల్: తల్లి జ్ఞాపకార్థం, మదర్స్ డే సందర్భంగా గంగిశెట్టి మధురమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో హుస్నాబాద్ మండలం పొట్లపల్లి గ్రామంలో శనివారం 100 మంది పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ దేవసాని సుశీల చేతుల మీదుగా వీటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకుడు జగదీశ్వర్‌ను సర్పంచ్, గ్రామస్తులు సన్మానించారు.

చేతనైన సాయం చేస్తున్నా..



అమ్మ జ్ఞాపకార్థం ట్రస్ట్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నా. అన్నదమ్ముల సహకారంతో ఇప్పటి వరకు రూ.40లక్షల సేవా కార్యక్రమాలు చేపట్టా. పేద విద్యార్థుల చదువుకు ఉన్నంతలో చేతనైన సాయం చేస్తున్నా.

– గంగిశెట్టి జగదీశ్వర్, ట్రస్ట్ ఫౌండర్

చెట్టంత ప్రేమతో..

- అమ్మ నాటిన చెట్టును సంరక్షించేందుకు చర్యలు
- అంత్యక్రియలు నిర్వహించిన చోట తిరిగి నాటించిన కుమారుడు



సాక్షి, సిద్దిపేట: అమ్మ నాటి సంరక్షించిన చెట్టు కలకాలం పదిలంగా ఉంచాలనుకున్నాడు ఆమె కుమారుడు. తల్లి అంత్యక్రియలు నిర్వహించిన చోట చెట్టును తిరిగి నాటించి మమకారాన్ని చాటుకున్నాడు. సిద్దిపేట పట్టణం రాఘవేంద్రనగర్‌కు చెందిన గన్నమనేని బాలకిషన్‌రావు, రాధ దంపతుల కుమారుడు హైకోర్టు న్యాయవాది కిరణ్‌కుమార్. తల్లి రాధ 2021 మే 12న కరోనాతో మృతిచెందగా, సిద్దిపేట అర్బన్ మండలం బూరుగుపల్లిలో తన వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించారు. తన తల్లి రాధ 25 ఏళ్ల కిందట ఇంటి ఆవరణలో నాటిన మామిడి మొక్క వృక్షమై ఫలాలను అందిస్తోంది. కాగా కొత్త ఇంటి నిర్మాణానికి ఆ చెట్టును కొట్టేయాల్సి రావడంతో తల్లడిల్లిపోయాడు. తల్లి జ్ఞాపకార్థం చెట్టు కలకాలం ఉండాలని నిశ్చయించి 2022 జూన్‌లో శాస్త్రీయ పద్ధతిలో కొమ్మలు కత్తిరించి యంత్ర సాయంతో తల్లి అంత్యక్రియలు నిర్వహించిన చోట మళ్లీ నాటించాడు. ఏడాది పాటు బాగానే ఉన్న తర్వాత వర్షపు నీళ్లు నిలిచి ఆ చెట్టు మురిగిపోయింది.

అమ్మను చూసుకుందామని..



అమ్మకు పండ్ల మొక్కలు అంటే చాలా ఇష్టం. అమ్మ నాటిన చెట్టులో అమ్మను చూసుకుందాం అనుకొని తిరిగి నాటించా.. కానీ దక్కలేదు. అమ్మ అంత్యక్రియలు నిర్వహించిన చోట త్వరలో అన్ని రకాల మామిడి, ఇతర పండ్ల మొక్కలను నాటుతా. ఫ్రూట్స్ పార్క్‌లా తయారు చేస్తా.

– కిరణ్ కుమార్, న్యాయవాది





మదర్స్ డే సందర్భంగా జిల్లా కేంద్రంలోని కోమటిచెరువు ట్యాంక్‌బండ్‌పై బతుకమ్మ ఘాట్ వద్ద పిల్లలతో సరదాగా సెల్ఫీ దిగిగుతున్న మాతృమూర్తులు. సాయం సంధ్యవేళ బిడ్డను ముద్దాడుతున్న తల్లి.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట

వేర్వేరు ఘటనల్లో పలువురికి గాయాలు

పటాన్‌చెరు టౌన్ పరిధిలో కారు, శివ్వంపేట మండలం కొత్తపేటలో ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో పలువురు గాయపడ్డారు.

అదుపుతప్పి కారు బోల్తా



పటాన్‌చెరుటౌన్: కారు బోల్తా పడిన ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటన పట్టణంలోని రామేశ్వరంబండ గ్రామ వీకర్ సెక్షన్ కాలనీ వద్ద శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఆ దారిలో వెళుతున్న ఓ కారు అదుపు తప్పి రోడ్డుపక్కన తవ్విన గుంతలో బోల్తా పడింది. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వారికి గాయాలవగా చికిత్స నిమిత్తం ఆస్పత్రి తరలించారు.

కొత్తపేటలో ట్రాక్టర్..





గాయపడిన కూలీ

శివ్వంపేట(నర్సాపూర్): ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడడంతో కూలీలకు గాయాలైన ఘటన మండలంలోని కొత్తపేటలో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. కొత్తపేట పూర్వ పంచాయతీ పరిధిలో ఉన్న ఇటుక బట్టీలకు పొట్టు తరలిస్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఒడిషాకు చెందిన ముగ్గురు కూలీలకు గాయాలవగా, చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అనుభవంలేని వారు డ్రైవింగ్ చేయడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ రవికాంత్‌రావు తెలిపారు.

రేణుక ఎల్లమ్మ ఆలయంలో చోరీ

పటాన్‌చెరు టౌన్: పట్టణ శివారులోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో చోరీ జరిగింది. ఆలయ నిర్వాహకులు తెలిపిన వివరాల ప్రకారం.. రోజు మాదిరిగానే శుక్రవారం ఆలయం మూసివేసి నిర్వాహకులు ఇంటికి వెళ్లారు. శనివారం ఉదయం వచ్చి చూడగా, ఆలయంలో మూడు హుండీల్లో చిన్న హుండీ పగిలిపోయి, నగదు ఎత్తుకెళ్లినట్టు ఆలయ నిర్వాహకులు గుర్తించారు. వెంటనే పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాలను పరిశీలించగా ఓ యువకుడు ఆలయ ఆవరణలో హుండీలు ఉన్న చోట తిరుగుతున్న దృశ్యాలు కనిపించాయి.



హుండీలో నగదు తీస్తుండగా సీసీ కెమెరాలో నమోదైన దృశ్యం

ఈతకు వెళ్లి మృత్యువాత

జిన్నారం(పటాన్‌చెరు): ఎండ వేడి నుంచి ఉపశమనం కోసం స్నేహితులతో కలిసి కుంటలో ఈత కొట్టేందుకు వెళ్లిన యువకుడు మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన గుమ్మడిదల మండలం కానుకుంట గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ విజయకృష్ణ వివరాల ప్రకారం.. కానుకుంటకు చెందిన ఎర్రోళ్ల నవీన్(17), పవన్, నగేశ్, శ్రీకాంత్‌తో కలిసి గ్రామ శివారులోని కొత్తకుంటలో ఈతకు వెళ్లారు. ఈ క్రమంలో నవీన్ కాలికి గాయమై ప్రమాద వశాత్తు నీటిలో మునిగిపోయాడు. స్నేహితులు వెంటనే విషయాన్ని నవీన్ తల్లిదండ్రులకు తెలపగా, వారు చెరువు వద్దకు వచ్చి చూసే సరికి చెరువులో మునిగిపోయాడు. కుటుంబ సభ్యుల సమాచారంతో అక్కడకు చేరుకున్న పోలీసులు చెరువులో గాలించి నవీన్ మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తమై మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.



నవీన్ మృతదేహం

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

రెండుకు చేరిన మృతుల సంఖ్య



మల్లేశం (ఫైల్)

జోగిపేట(అందోల్): అందోలు మండలం అన్నాసాగర్ శివారులో ఈ నెల 7న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మల్లేశం (20) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించడంతో శనివారం స్వగ్రామమైన చింతకుంటలో అంత్యక్రియలను నిర్వహించారు. కాగా ఈ ప్రమాదంలో నలుగురు గాయపడగా రెండు రోజుల క్రితం రాజు మృతిచెందిన విషయం తెలిసిందే. మల్లేషం మృతితో మృతుల సంఖ్య రెండుకు చేరింది. మరో ఇద్దరు చికిత్స పొందుతున్నారు. జోగిపేటలోని గాజుల దుకాణంలో పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న మల్లేశం మృతి చెందడంతో కుటుంబం సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

వడదెబ్బతో వృద్ధుడు..

నిజాంసాగర్ (జుక్కల్): కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండల కేంద్రంలో వడదెబ్బతో వృద్ధుడు మృతి చెందాడు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం అనంతసాగర్ గ్రామానికి చెందిన అంబయ్య (68) రెండ్రోజుల క్రితం కామారెడ్డి జిల్లా తాడ్వాయిలోని శబరిమాత ఆలయ దర్శనానికి వచ్చాడు. శనివారం తిరిగి వెళ్తూ నిజాంసాగర్ బస్టాండ్ ప్రాంతంలో ఎండవేడిమికి తట్టుకోలేక స్పృహ తప్పి పడిపోయాడు. స్థానికులు సపర్యలు చేసి ఓఆర్ఎస్ తాగించారు. అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి కుమారుడు రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

రాడ్డు తగిలి కార్మికుడు..

చిన్నశంకరంపేట(మెదక్): ప్రమాదవశాత్తు పరిశ్రమలో ఇంజిన్‌లోని రాడ్డు తలకు తగిలి కార్మికుడు మృతి చెందిన ఘటన చిన్నశంకరంపేట ఎలాస్‌మెంట్ కన్వెక్టర్ పరిశ్రమలో చోటుచేసుకుంది. చిన్నశంకరంపేట ఇన్‌చార్జ్ ఎస్ఐ పోచయ్య కథనం మేరకు... బిహార్ రాష్ట్రం బోజ్పూర్ జిల్లా రుబేదికి చెందిన బహదూర్ యాదవ్ (25) శుక్రవారం రాత్రి పరిశ్రమలో పనిచేస్తుండగా ఇంజిన్‌రాడ్ తలకు తగిలింది. తీవ్రంగా గాయపడిన బహదూర్‌ను గాంధీ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి గ్రామానికి చెందిన తోటి కార్మికుడు రుపేష్‌యాద్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇటుకబట్టీ యజమానితో కార్మికుల ఘర్షణ

చేర్యాల(సిద్దిపేట): పట్టణ శివారు తూర్పు గుంటూరుపల్లి ప్రాంతంలో ఓ ఇటుక బట్టీ యజమానికి కార్మికుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఇటుక బట్టీ యజమాని రామకృష్ణ బట్టీలో పని చేసేందుకు ఒడిషా నుంచి 100 మంది కార్మికులను తీసుకువచ్చాడు. పని విషయంలో కార్మికులకు, యజమానికి మధ్య శనివారం ఘర్షణ తలెత్తింది. దీంతో ఒకరిపై ఒకరు దాడి చేసుకునే వరకూ వెళ్లింది. ఆగ్రహించిన కార్మికులు భార్య, పిల్లలతో కలిసి సామన్లు సర్దుకుని వెళ్లిపోయారు. రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న వీరిని స్థానికులు ఏమైందని ఆరా తీయగా.. ఇటుక బట్టీ యజమాని తమను సరిగా చూసుకోవడం లేదని, తమపై దాడి చేశాడని తెలిపారు. ఈ విషయమై ఇటుక బట్టీ యజమాని రామకృష్ణను ఫోన్‌లో సంప్రదించగా.. ఒప్పందం ప్రకారం రెండు వారాల పాటు పని చేయాల్సి ఉందని, ఈ విషయమై ప్రశ్నిస్తే ఘర్షణకు దిగి వెళ్లిపోయారని సమాధానం ఇచ్చాడు.



సామగ్రితో వెళుతున్న కార్మికులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి



గాండ్ల రాములు (ఫైల్)



నాగరాజు (ఫైల్)



రోడ్డు ప్రమాద దృశ్యం

జోగిపేట(అందోల్): బైక్, ఆటో ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు మృతి చెందారు. ఈ ఘటన అందోలు మండలం బ్రహ్మణపల్లి చౌరస్తా వద్ద శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ వివరాల ప్రకారం.. అందోల్‌కు చెందిన గాండ్ల రాములు (29), డాకూర్ గ్రామానికి చెందిన చింతకి నాగరాజు (24) బైక్‌పై తాలెల్మలోని ఓ ఫంక్షన్‌కు వెళ్లి, జోగిపేటకు తిరిగి వస్తుంన్నారు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న టాటా ఏస్ వాహనం ఢీ కొట్టింది. ఈ ఘటనలో రాములు, నాగరాజు అక్కడికక్కడే మృతిచెందారు. డ్రైవర్ అజాగ్రత్తతో ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సామ్యానాయక్ తెలిపారు.

రెండుమూడు రోజుల్లో చంపేస్తాం..

ఇంటి గోడపై రాసిన దుండగులు

గజ్వేల్‌రూరల్: రెండు, మూడు రోజుల్లో బాబును చంపేస్తామంటూ గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి గోడలపై రాసిన ఘటన గజ్వేల్ మండలం బెజుగామలో చోటు చేసుకుంది. బాధితులు, పోలీసులు వివరాల ప్రకారం.. బెజుగామ గ్రామానికి చెందిన నాంపల్లి బాబుకు కొందరితో భూమి పంచాయితీ నడుస్తోంది. ఈక్రమంలో శనివారం ఉదయం లేచి చూసేసరికి రెండు, మూడు రోజుల్లో చంపేస్తామంటూ రాసి ఉండడం, ఇంటిపై డీజిల్ చల్లి ఉందని బాధితుడు బాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తనకు, కుటుంబానికి ప్రాణహాని ఉందని, పోలీసులు విచారణ చేపట్టి తమకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీరప్రసాద్ తెలిపారు.



ఇంటి గోడపై రాసిన రాతలు